# ప్రేమకై జీవించు

- యు. మల్లిఖార్జునరావు

"ప్రపంచంలో ప్రేమని ఎంతోమంది కవులు, రచయితలు ఎన్నో కోణాల్నుంచి స్పృశించారు. మరెంతో మంది ఎన్నోరకాలుగా నిర్వచించారు" నిర్వచిస్తున్నారు. నా దృష్టిలో ప్రేమకు నిర్దిష్టమైన నిర్వచనం లేదని, అసలు ప్రేమంటే ఏమిటి? మనసుతో స్నేహం చేయడమా! ఒకరికొకరు ఇష్టపడే ఆ అనుభూతికి, ఆ ప్రేమకి ఎన్నో నిర్వచనాలు.

"ప్రేమ కొందరికి విషాదాన్ని మిగిల్చిపోతూ ఉంటుంది. మరికొందరికి మనశ్శాంతి లేకుండా చేస్తుంది. ఇంకొందరికి ఇద్దరి మధ్య చీకులాటలు తెచ్చిపెడ్తుంది. నన్ను మాత్రం ఆరాటంలో ఉంచింది."

అసలు! ఇదంతా ఆలోచించడానికి కారణం లేకపోలేదు. ఇప్పుడు నేను వెళ్తున్న ఈ సిటీ బస్సులో ముందున్న లేడీస్ సీట్లలో తలోదరి కనిపించడమే!

తలోదరి 'శాతవాహన జంక్షన్'కి ఎదురుగా కనిపించే పచ్చమేడే. ఆ పచ్చమేడకి ముప్పై అడుగుల దూరంలో మూడు షాపులున్న డాబా మాది.

సాయంత్రం ఐదయ్యేసరికి నేను మా డాబా మీద అతుక్కుపోతాను. ఆ వేళలో తలోదరి కాలేజీ నుండి వస్తుంది.

కాలేజీ నుండి రాగానే ఒక్కొక్కసారి మేడెక్కేది. మేడెక్కినపుడు ఆమె చూపులకు అర్థం ఆమెకే తెలియాలి. నాకు మాత్రం నావైపు చూస్తున్నపుడు ఆర్తిగా చూస్తున్నట్టనిపించేది.

తలోదరి చూపులు నా మనస్సులో ముద్రితంగానే ఉంటాయి. ఆ నవ్వు, వినమ్రమైన ఆమె కోమలత్వం ఎప్పటికీ అలాగే నాలో ఉంటాయి.

అనిర్వచితమైన ప్రేమ గురించి "నాలో ఆలోచనలు ఒకదానికొకటి యుద్ధం చేసుకుంటాయి. నాలో ఎన్నో ఆశలు, భవిష్యత్తులో నిజమవుతాయో లేదో కాని ఊహలో మటుకు అనుభూతిగా అనుభవించేస్తున్నాను."

తలోదరి మేడెక్కని రోజున నాకు తోడుగా ఆ సంధ్య ఉంటుంది. పడమరన ఎదురుగా కనిపించే ఆ రెండు కొండల మధ్య అందంగా దీనంగా వెళ్ళిపోతున్న ఆ సంధ్యని చూస్తుంటే ఏదో బాధ కలుగుతుంది. తలోదరి మేడెక్కకపోవడమే ఆ దిగులు.

తలోదరి మేడెక్కనిరోజు నేను ఆ సంధ్యని అలాగే చూస్తుంటే ఒక్కొక్కసారి ఇంటిలో కిటికీలో నుండి చూసిన తలోదరి మేడెక్కేది. నావైపు ఎంతగా ప్రేమగా చూస్తున్నట్లు అనిపించేది. తలోదరి మేడెక్కినవెంటనే నాచూపులు తలోదరి వైపు మరలేవి.

నేను రోడ్డు మీద నుండి వస్తున్నప్పుడు నాకు తలోదరి తారసపడినప్పుడు నేను ఎడమవైపు నడిస్తే ఆమె కుడివైపు వెళ్తుంది. నేను కుడివైపు ఉంటే ఎడమవైపు నడుస్తుంది. అలా నడిచేటపుడు ఆమె ముఖంలో చిరునగవు కళ్ళలో కదలాడినప్పుడు నేను గమనించకపోలేదు.



'ఇలా నడవడం నేనున్నప్పుడే అని చాలాసార్లు గమనించాను'. నేనెళ్ళే రూటులో వెనకరావడానికి ఆమెకి అంత బిడియమెందుకో అది నా మీద ఉన్న అనురాగం అయివుండవచ్చు కదా!

నేనొకసారి కొత్త సంవత్సరానికి గ్రీటింగ్ కార్డు ఇచ్చే ధైర్యం లేక డిశంబరు ముప్పై ఒకటి రాత్రి పన్నెండు గంటలకి ఇంటికి వెళ్ళి పెరట్లో గ్రీటింగ్ కార్డు గిరాటేసి వచ్చాను.

మర్నాడు తలోదరి నన్ను చూసి నవ్వి. అమ్మో...! "ఎంతధైర్యం కలవాడైనా ప్రేమించే వ్యక్తి ముందులో మాట్లాడడానికి ధైర్యం కోల్పోతాడని నా నమ్మకం"

ఒకనాడు 'బట్టలషాపుకి' అండర్‌వియర్స్ కొనడానికి నేను నా స్నేహితుడు వెళ్ళినపుడు, అక్కడ తలోదరి ఉండటం చూసి బయటికి వెళ్ళలేక — లోపల 'అండర్‌వియర్స్' అడగలేక తత్తరపాటులో 'ఎయిటీఫైవ్‌సైజు' అండర్‌వియర్స్ ఇవ్వండి అని చెప్పినపుడు నా స్నేహితుడు 'సెవెంటీఫైవ్' కదా 'ఎయిటీఫైవ్' ఐతే జారిపోతాయి అన్నపుడు అక్కడ తలోదరి నోటి మీద చేయి పెట్టుకుని నన్ను చూసి నవ్వినపుడు ఆమె మనస్సులో మా ఇద్దరి బంధం ఏమిటో అర్థం చేసుకున్నాను."

దానికితోడు మన సమాజంలో "ఆడదానికి స్వేచ్ఛ ఎక్కడుంది. ఒక మగవాడితో ఆడది స్నేహంతో మాట్లాడితే శారీరక సంబంధం ఏర్పడినట్టు ప్రచారం చేయగలదీలోకం. నాతో వచ్చి మాట్లాడితే నేను తిరస్కరిస్తానేమో అనిపించవచ్చు. అలా మాట్లాడినపుడు ఈలోకం శారీరక సంబంధం అంటగట్టవచ్చు. మగవాడికి ఎన్నిసార్లు పరువుపోయినా సంఘంలో తలెత్తుకు తిరుగుతాడు. అందరూ అతన్ని 'కళాపోషకుడు' అంటారు. ఆడదానికి ఒక్కసారి నిందవేస్తే జీవితమంతా నరకం అవుతుంది. స్వేచ్ఛగా వచ్చి తన అభిప్రాయం చెప్పడానికి 'స్త్రీ'కి ఈ సమాజంలో వీలులేనపుడు ఆమె నాతో ఎలా మాట్లాడుతుందిలే. 'స్త్రీ' కట్టుబాట్ల విషయంలో సమాజం ఎప్పుడు మారుతుందో ఏమో!"

ఇక నేనే వెళ్ళి ఆమెతో మాట్లాడి అటో ఇటో తేల్చేసుకోవాలి. నేనే తెగించాలి. ఈ నిర్ణయం నాలో బలపడుతుంది. ఇంతలో కండక్టర్ 'శాతవాహన జంక్షన్' అన్నాడు. ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. తలోదరి ఆ పచ్చమేడవైపు, నేను ఇటుగా మా ఇంటివైపు నడక సాగించాము. ●